# చరిత్రలో నిలిచే నేత సీఎం కేసీఆర్

- డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో హోంమంత్రి మహమూద్ అలీ
- హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

జగద్గిరిగుట్ట,అక్టోబర్2: శతాబ్దానికి ఒకరు మాత్రమే గాంధీలా చరిత్రలో నిలిచిపోయే నేతలు వస్తుంటారని రాష్ట్ర హోంమత్రి మహమూద్ అలీ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం గాంధీ తీసుకొస్తే.. ఉనికి కోల్పోతున్న తెలంగాణాను కేసీఆర్ సాధించారన్నారు. దుడింగల్ గండిమైసమ్మ వద్ద సోమవారం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరై డబుల్‌బెడ్‌రూంలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ఎమ్మెల్యేలు కే.పీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో కలిసి ఆవిష్కరించారు. అసాధ్యం అన్నదాన్ని సాధించి చూపడం కేసీఆర్ నాయకత్వానికి నిదర్శనమన్నారు. తెలంగాణ సాధనకు 14 ఏళ్ల సుధీర్ఘపోరాటం ఆయనకే సాధ్యమన్నారు. తెలంగాణా వస్తే నీటిసమస్య, నక్సలిజం, శాంతిభద్రతలు, ఆరోగ్యభద్రత ఎమవుతుందో అన్నవారికి పోరాటంతోపాటు, అందర్నీ ఒప్పించి తెలంగాణ సాధించారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్‌అలీ

**అదనంగా మరో లక్ష ఇండ్లు..**

తాజాగా నిర్మించిన వాటికి అదనంగా మరో లక్ష డబల్ బెడ్‌రూంలు ముఖ్యమంత్రిని ఒప్పించి నిర్మిస్తామన్నారు. అందుబాటులో ఉండే ఎమ్మెల్యేలు వివేకానంద, మాధవరం కృష్ణారావులను గెలిపించడం ద్వారా కేసీఆర్‌ను మరోసారి అధికారం అప్పగించాలని సూచించారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్‌లకు చెందిన 3142 ప్లాట్లను లబ్ధిదారులకు అప్పగించారు. ఉన్నతాధికారుల క్వార్టర్స్‌కంటే డబల్‌బెడ్‌రూం ఇళ్లు బావున్నాయని అప్పటి గవర్నర్ నరసింహన్ ప్రశంసించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. అడక్కుండానే విలువైన ప్రాంతాల్లో డబల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడం కేసీఆర్ గొప్పతనమన్నారు. ఇళ్లు రానివారికి కూడా న్యాయం జరుగుతుందన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలు ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా ఇలాంటి పథకాలు ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. పారదర్శకంగా కేటాయింపు, ఎలాంటి ఖర్చులేకుండా అందిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇళ్లు దక్కేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నిజాంపేట మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి కృష్ణ, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, అధికారులు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

## ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి



యూసుఫ్‌గూడలో ఓటర్లతో మాట్లాడుతున్న అధికారులు

జూబ్లీహిల్స్,అక్టోబర్2: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటరుకు అండగా నిలిచేందుకు ఎన్నికల సంఘం అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపడుతున్నారు. జిల్లా ఎన్నికల సంఘం అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాలతో సోమవారం ఎన్నికల అధికారులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెక్టోరియల్ ఆఫీసర్ సుధాకర్.. పోలీస్ ఆఫీసర్ ఠాకూర్‌తో కలిసి యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని పలు బస్తీలలో ఓటర్లతో మాట్లాడి వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సెక్టోరియల్ ఆఫీసర్ సుధాకర్ మాట్లాడుతూ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అవసరమైన నైతిక మద్దతును ఇస్తామని తెలిపారు. బీఎల్‌వో సూపరవైజర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 28 న ఇన్విటేషనల్ జిమ్నాస్టిక్ సమావేశం

జూబ్లీహిల్స్,అక్టోబర్2: విష్ణునగర్ జిమ్నాస్టిక్స్ ఇనిస్టిట్యూట్, చైతన్య జిమ్నాస్టిక్స్ ఇనిస్టిట్యూట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని విజయనగర్ కాలనీలో అక్టోబర్ 28 న ఇన్విటేషనల్ ఫస్ట్ లెవల్‌వైస్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ మీట్ నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్ తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తొలిసారి తెలంగాణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు.. బాలబాలికల విభాగాలలో 5 నుంచి 20 ఏండ్ల వరకు మినీ, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ గ్రూప్‌లలో పోటీలుంటాయని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన జిమ్నాస్ట్‌లు దేశంలోని ఏ రాష్ట్రానికి చెందిన వారైనా ఈ జిమ్నాస్టిక్ మీట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు వివరాలకు.. మోహన్, ప్రధాన కార్యదర్శి 98497 34784, కోచ్‌లు రిషబ్ 798 986 6784, రితిక్ మిశ్రా 9182 550 632 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

## కళారంగ్ కాలనీలో అన్నదానం



'మిలాద్ ఉన్ నబీ' సందర్భంగా న్యూబోయిగూడలోని కళారంగ్ కాలనీలో అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు తలసాని మహేశ్ యాదవ్ ప్రారంభించారు. నిర్వాహకులైన మహ్మద్ ఉమరుద్దీన్, జావెద్, అస్లమ్, సమీ, అక్బర్, అక్రమ్, అల్తాఫ్, ఇమ్రాన్‌లను ఆయన అభినందించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు సురేశ్, వెంకట్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

–బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 2

## బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి

జగద్గిరిగుట్ట,అక్టోబర్2: బీసీలు అన్నిరంగాల్లో మరింతగా రాణించాలని బీసీచైతన్య సమితి ప్రతినిధులు ఆకాంక్షించారు. జగద్గిరిగుట్టలో సోమవారం జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిలిగొండ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఏనుగుతల యాదగిరిని ఎంపిక చేశారు. బీసీ కులాల సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి'


ఖైరతాబాద్, అక్టోబర్ 2 : న్యాయవాదుల కోసం ప్రభుత్వ ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ బర్ల మల్లేశ్ యాదవ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. ప్రస్తుతం న్యాయవాదులపై పలు చోట్ల దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, వారికి రక్షణ చట్టం ఏర్పాటు చేసి భద్రత కల్పించాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేల స్టయిఫండ్‌తో పాటు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ న్యాయవాదులు జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ పొలాస శంకర్, రామకృష్ణ, నర్సింగ్, కన్వీనర్ విష్ణు, సహ కన్వీనర్లు భరత్, బాలకృష్ణ, పరుశురాం, స్పోక్స్ పర్సన్ నరేశ్ గౌరీశం, సంతోష్, కుమార్, శివ పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళి



గాంధీనగర్ గాంధీజయంతిలో ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్‌ఎస్ నేతలు

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం,అక్టోబర్2: గాంధీ జయంతి సందర్భంగా.. ఎమ్మెల్యే వివేకానంద్ రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో మహాత్మునికి నివాళులర్పించారు. ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో మహాత్మునికి నివాళులర్పించారు. నిజాంపేట మున్సిపల్ కార్యాలయంలో మేయర్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ గాంధీజయంతి జరిపారు. కొంపల్లిలో మున్సిపల్ చైర్మన్ సన్నశ్రీశైలంయాదవ్, దుండిగల్‌లో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ నివాళులర్పించారు. దూలపల్లిలో కొంపల్లి మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగయ్య, సూరారంలో మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, జగద్గిరిగుట్టలో జైహింద్, బీఆర్‌ఎస్ నేతలు గాంధీజయంతిలో పాల్గొన్నారు. నిజాంపేటలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొలను శ్రీనివాసరెడ్డి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.



శంభీపూర్‌లో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, నేతలు



దుండిగల్‌లో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ



నిజాంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ నీలారెడ్డి, నేతలు



కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నశ్రీశైలం యాదవ్, నేతలు



జగద్గిరిగుట్టలో బీఆర్‌ఎస్ నేత జైహింద్ తదితరులు

### పైసా ఖర్చు లేకుండా సొంతిళ్లు



ఏండ్లనుంచి ఇరుకుగా ఉండే కిరాయి ఇంట్లో ఇబ్బంది పడుతున్నాం. విశాలమైన డబల్ బెడ్‌రూం ఎవరికీ నయాపైసా ఇవ్వకుండానే సొంతం అయ్యింది. భర్త కార్పెంటర్‌గా పనిచేస్తాడు. అద్దెకు కట్టే డబ్బులు మిగలడంతో కుటుంబ అవసరాలు తీరుతాయి. కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. మళ్లీ ఆయననే సీఎం అయితే మాలాంటి పేదలకు మరింత మేలు జరుగుతుంది.

– పి.దీపిక రాజీవ్‌గృహకల్ప, జగద్గిరిగుట్ట

### చెప్పలేనంత ఆనందంగా ఉంది..



పేదప్రజలను కేసీఆర్ పెద్దన్నలా ఆదుకుంటున్నాడు. భర్త కూరగాయలు అమ్ముతాడు. మెదక్ నుంచి వచ్చి 30 ఎండ్లుగా ఎన్నో కిరాయి ఇండ్లు మారాల్సివచ్చింది. అప్పులతోనే జీవితం గడిచేది. సీఎం దయతో ఇళ్లు దక్కింది. కేసీఆర్ గొప్పతనాన్ని అందరికీ తెలియజేస్తాం. కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– ఫైజనాబేగం, షాపూర్‌నగర్

### సంక్షేమం అందుతోంది..



చాలామంది పేదలు, అర్హులకు ఏదోరూపంలో కేసీఆర్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అందుతూనే ఉన్నాయి. మాకు డబల్ బెడ్‌రూం మొదట రాలేదనుకున్నా రొండో విడతలో వచ్చింది. వేచి చూస్తే చాలామంది పేదలకు రాబోయే రోజుల్లో వస్తాయని తెలుస్తోంది. మరోసారి కేసీఆర్‌ను గెలిపిస్తే ప్రజలందరికీ మేలు కలుగుతుంది.

– సుగుణ, జీడిమెట్ల

### డబల్ ఇళ్లు చాలా బాగున్నాయి..



నాణ్యతతో కూడిన విశాలమైన డబల్‌బెడ్‌రూం ఇళ్లు రావడంతో సంతోషంగా ఉంది. ఎలాంటి పైరవీ, ఖర్చులేకుండా టెక్నాలజీ సాయంతో కేటాయించడంతో ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది. రానివారికి కూడా భవిష్యత్‌లో తమ అర్హత మేరకు సంక్షేమం పొందగలమనే భరోసా వచ్చింది. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే ఇంకా గొప్పగా ఉంటుందని చెప్పగలుగుతాం.

– సృజన, సనత్‌నగర్